క్లుప్తంగా

విద్యార్థుల క్షేత్రపర్యటన



పట్టణ సీఐతో విద్యార్థులు

నిర్మల్‌చైన్‌గేట్: పట్టణంలోని బుధవార్‌పేట్ శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో నాలుగవ తరగతి విద్యార్థులు క్షేత్రపర్యటన కోసం సోమవారం పోలీసుస్టేషన్, పోస్టాఫీసు కార్యాలయాన్ని సందర్శించారు. పోస్టాఫీస్‌లో నిర్వహించే పనులు, టెలిగ్రామ్, లెటర్ పంపే విధానం, సుకన్య పథకం, ఎన్ఎస్‌సీ, కేవీపీ స్కీంల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీసుస్టేషన్‌లో సీఐ నితీశ్‌కుమార్ పురప్రజలకు అందించే సేవలను వివరించారు. విద్యార్థుల వెంట పాఠశాల ప్రధానాచార్యులు కొండూరు నరేశ్, ఉపాధ్యాయులు ఉన్నారు.

మిత్రుడి కుటుంబానికి అండగా..



ఆర్థికసాయం అందిస్తున్న మిత్రులు

లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్‌కు చెందిన ప్రసాద్ ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. ప్రసాద్‌తో కలిసి మండలంలోని వడ్యాల్ ఉన్నత పాఠశాలలో 2000–2001 బ్యాచ్ పదోతరగతి చదివిన మిత్రులు బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. రూ.40వేలు పోగుచేసి సోమవారం కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మిత్రులు నాగుల భూమేశ్, ప్రవీణ్, సాగర్, అశోక్, సురేందర్, సతీశ్, గణేశ్, రాజేందర్, అశోక్ తదితరులు ఉన్నారు.

ట్రేడ్ లైసెన్స్‌తోనే గుర్తింపు



అవగాహన కల్పిస్తున్న డీఎల్పీవో సుదర్శన్

కుంటాల: ట్రేడ్ లైసెన్సులతోనే వ్యాపారాలకు గుర్తింపు ఉంటుందని డీఎల్పీవో సుదర్శన్ పేర్కొన్నారు. మండలకేంద్రంలో దుకాణదారులకు సోమవారం ట్రేడ్ లైసెన్స్‌పై అవగాహన కల్పించారు. ట్రేడ్ లైసెన్స్ కలిగి ఉన్నవారు చట్టప్రకారం వ్యాపారం చేసుకోవచ్చని సూచించారు. నిర్ణీత సమయంలో లైసెన్స్‌లు పునరుద్ధరించుకోవాలని కోరారు. ఎంపీడీవో లింబాద్రి, ఎంపీవో రహీంఖాన్, పంచాయతీ కార్యదర్శి రాజబాపు తదితరులు ఉన్నారు.

'ఆదర్శ'లో ఫేర్‌వెల్ డే



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కుంటాల: స్థానిక ఆదర్శ పాఠశాలలో ఇంటర్ విద్యార్థులు సోమవారం ఫేర్‌వెల్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యాలు, నాటికలు, ఫ్యాషన్ షో ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ నవీన్‌కుమార్, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

వీడ్కోలు హంగామా



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కుభీర్: స్థానిక ప్రభుత్వ జూని యర్ కళాశాలలో సోమవారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థుల వీడ్కోలు వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ సునీల్, అధ్యాపకులు భాస్కర్, రమేశ్, శివరాజ్, శ్రీనివాస్, నర్సయ్య, మాధవి, లింగయ్య, మహేశ్, గజేందర్, పోషకులు తదితరులు ఉన్నారు.

ప్రింటర్ అందజేత

లోకేశ్వరం: మండలంలోని గడ్‌చాందకు చెందిన నాగేందర్‌రావు–కవిత దంపతుల కూతురు జాహ్నవి సోమవారం పుట్టినరోజు సందర్భంగా ఉన్నత పాఠశాలకు ప్రింటర్‌ను అందజేశారు. రూ.26 వేలు విలువ గల ప్రింటర్‌ను హెచ్ఎం రవీందర్‌కు అందించారు. ఉపాధ్యాయులు కాశీరాం, కోటేశ్వర్‌రావు, రమేశ్‌గౌడ్, శ్రీనివాస్‌రావు, భూమన్న, భోజన్న ఉన్నారు.

పరిహారం కోసం వేడుకోలు



ఈ చిత్రంలో ఉన్నది రైతు మల్లేశ్. ఈయనది ఓలా గ్రామం. రెండెకరాల్లో మొక్కజొన్న సాగు చేశాడు. ఆదివారం రాత్రి అడవి పందుల దాడిలో అర ఎకరం దెబ్బతింది. సుమారు రూ.20 వేల నష్టం వాటిల్లిందని రైతు తెలిపాడు.



వెంకూర్‌లో పందుల దాడిలో నేలవాలిన మొక్కజొన్న

- అడవిపందుల దాడిలో మొక్కజొన్న ధ్వంసం
- కంకులను తినేస్తున్న వైనం
- రైతులకు తీవ్ర నష్టం

కుంటాల: విత్తనం విత్తినప్పటి నుంచి పంట చేతికొచ్చే వరకు రైతును కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. ఓ వైపు తెగుళ్లు, చీడపీడల బెడద, వాతావరణ పరిస్థితుల కారణంగా దిగుబడి రాక ఆర్థికంగా నష్టపోతుంటే.. మరోవైపు అడవి జంతువులు పంటలపై దాడి చేస్తున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దెబ్బతిన్న పంటలకు పరిహారం అందించడంలో రాష్ట్రప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని వారు వాపోతున్నారు.

మొక్కజొన్నపై అడవి పందుల దాడి

వానాకాలంలో పత్తి, సోయా సాగు చేసిన ఆశించిన దిగుబడి రాలేదు. యాసంగి సీజన్‌లో బోరుబావుల కింద 4,650 ఎకరాల్లో రైతులు మొక్కజొన్న సాగు చేశారు. మండలంలోని పెంచికల్‌పాడ్, లింబా(కె), అంబుగామ, వెంకూర్, కుంటాల, ఓలా, అంబకంటి తండా, అందాకూర్ గ్రామాల్లో ఇటీవల అడవి పందులు దాడిలో పంటలు దెబ్బతిన్నాయి. సుమారు 16 ఎకరాల్లో నష్టం వాటిల్లింది. యాసంగి ఆరంభంలో మొక్కజొన్నకు కత్తెర పురుగు సోకినా.. అధికారుల సూచన మేరకు రైతులు మందులు వాడి కాపాడుకున్నారు. ప్రస్తుతం చుంచు, కంకి వేసే సమయం కాగా మరో వారం 15 రోజుల్లో పంట చేతికొస్తుండగా రాత్రివేళ అడవి పందుల దాడి చేసి నష్టం కలిగిస్తున్నాయి. మొక్క మొదటి భాగం పడగొట్టి కంకులను తినేస్తున్నాయి. పంటలు కాపాడుకునేందుకు సోలార్ కంచెలు, పక్షుల బెడద కోసం వివిధ పరికరాలు ఏర్పాటు చేసుకున్నా ఫలితం లేదని వాపోతున్నారు. అధికారులు దెబ్బతిన్న పంటలపై సర్వే చేపట్టి పరిహారం అందించాలని కోరుతున్నారు.

పంటల రక్షణ కోసం..

అడవి పందుల బారి నుంచి పంటలను రక్షించుకునేందుకు అధికారులు సూచనలు చేస్తున్నారు. పంటల చుట్టూ రెండు వరుసల్లో బైండింగ్ వైర్ (ఇనుప తీగలు) ఏర్పాటు చేసుకోవాలి. కోడిగుడ్లలో ఉండే సొన నీళ్లలో కలిపి పంట చుట్టూ గట్లపై పిచికారి చేస్తే వాసన చూసి దూరంగా వెళ్తాయి. మంకీ గన్ ద్వారా శబ్దం, బిగ్గరమైన శబ్దాలు, కేకలు వేస్తే మనుషులు ఉన్నారని గమనించి వెళ్లిపోతాయి. సెలూన్ షాపుల్లో వెంట్రుకలను చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసి పంట చుట్టూ వేస్తే వాటి వాసన చూసే క్రమంలో ముక్కులోకి వెళ్లి పరుగులు పెడతాయి. పంట చుట్టూ విద్యుత్ కంచెలు ఏర్పాటు చేయడం వల్ల జంతువులతోపాటు మనుషులకు ప్రమాదాలు సంభవించవచ్చని అధికారులు సూచిస్తున్నారు.

సర్వే నిర్వహించాలి



నా భూమితోపాటు మరో రెండున్నర ఎకరాలు కౌలు తీసుకుని మొక్కజొన్న సాగు చేశా. ఇటీవల అడవి పందుల దాడిలో అర ఎకరం వరకు నష్టపోయాను. అధికారులు సర్వే నిర్వహించి ఆదుకోవాలి.– గోడపురం గజేందర్, రైతు, కుంటాల

పరిహారం అందించాలి



25 ఎకరాల్లో మొక్కజొన్న వేసినా. పంట చేతికొచ్చే సమయంలో వారం క్రితం పందుల దాడిలో ఎకరం నష్టం వాటిల్లింది. పంటను చూస్తే కన్నీళ్లు వస్తున్నాయి. ప్రభుత్వం పరిహారం అందజేయాలి.

– బాజీరావు పటేల్, రైతు, వెంకూర్

సర్వే నిర్వహిస్తాం

పంట నష్టపోయిన రైతులు దరఖాస్తు చేసుకోవాలి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సర్వే నిర్వహించి ప్రతిపాదన పంపిస్తాం. పంటను కాపాడేందుకు చర్యలు చేపట్టాలి. రైతులు పంటల చుట్టూ విద్యుత్ కంచెలు అమర్చవద్దు.

– వేణుగోపాల్, ఎఫ్ఆర్వో

మహిళా సాధికారితకు చేయూతనివ్వాలి



ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: మహిళా సాధికారితకు చేయూతనందించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ బ్యాంకర్లకు సూచించారు. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో బ్యాంకర్లతో సోమవారం సమావేశం నిర్వహించారు. సోమవారం నుంచి ఈనెల 28 వరకు ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళల ఉన్నతి కోసం బ్యాంకులు ఎన్నో సదుపాయాలను కల్పిస్తున్నాయన్నారు. మహిళలకు సంబంధించి ఆర్థిక అంశాలతో ముడిపడి ఉన్న పథకాలపై మహిళలకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. స్వయం సహాయక సంఘాలకు చేయూతనివ్వడానికి ఎన్నో పథకాలు ఉన్నాయని, మహిళా సాధికారిత సాధించడానికి ఎంతగానో తోడ్పడతాయన్నారు. బ్యాంకు సహకారంతో మహిళలు వాణిజ్య, వ్యాపార రంగాల్లో రాణిస్తున్నారన్నారు. వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 25న మంగళవారం 2కే రన్ నిర్వహించాలని, యువత, మహిళలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం అధికారులతో కలిసి కలెక్టర్ ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్లు విడుదల చేశారు. సమావేశంలో లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్‌గోపాల్, ఆర్డీవో రత్నకళ్యాణి, డీఆర్డీవో విజయలక్ష్మి, డీఈవో పి.రామారావు, వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, డీఎంహెచ్‌వో రాజేందర్, డీవైఎస్‌వో శ్రీకాంత్‌రెడ్డి, డీహెచ్ఎస్‌వో రమణ పాల్గొన్నారు.

ఖోఖో క్రీడాకారుడికి సన్మానం



శివారెడ్డిని సన్మానిస్తున్న జోగు రామన్న

కైలాస్‌నగర్: ఇటీవలలో ఢిల్లీలో జరిగిన ఖోఖో ప్రపంచకప్‌లో ప్రాతినిధ్యం వహించిన ఆదిలాబాద్ పోస్టల్ డిపార్ట్‌మెంట్ క్రీడాకారుడు శివారెడ్డిని మాజీ మంత్రి జోగు రామన్న సోమవారం సన్మానించారు. పూలమాల, శాలువాతో సత్కరించారు. మిఠాయిలు తినిపించి అభినందించారు. ఖోఖో ప్రపంచకప్‌లో మహిళ, పురుషుల జట్టు విజేతలుగా నిలువడం అభినందనీయమన్నారు. జాతీయస్థాయిలో చోటు దక్కించుకోవడంతో పాటు పోటీల్లో రాణించడం అభినందనీయమని కొనియాడారు. నాయకులు సాజీదోద్దీన్, సతీశ్ పాల్గొన్నారు.

ఆలయంలో పూజలు



జెడ్పీ మాజీ చైర్మన్ దంపతులను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

సోన్: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన శ్రీ గోడిసేరియాల రాజరాజేశ్వర ఆలయంలో జెడ్పీ మాజీ చైర్మన్ శోభారాణి–సత్యనారాయణ గౌడ్ దంపతులు సోమవారం పూజలు చేశారు. అనంతరం వారిని ఆలయకమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. ఆలయ నిర్మాణం పూర్తికి కృషి చేసిన పూజారి శ్రీ సదానందస్వామిని అభినందించారు. అనంతరం మండల కేంద్రంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్యను మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ప్రచారం చేశారు. బీజేపీ నాయకులు మార గంగారెడ్డి, నర్సయ్య, ముత్కపల్లి నరేశ్, రాజనర్సయ్య, శ్రీనివాస్, గంగాధర్, భక్తులు తదితరులు ఉన్నారు.

శివరాత్రి ఉత్సవాలు ప్రారంభం



రంగపేట ఆలయం

ఖానాపూర్: పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో శివరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. బీర్నంది పంచాయతీ పరిధి రంగపేటలోని రాజరాజేశ్వర ఆలయంలో అర్చకుడు గోనె శంకరయ్య ఆధ్వర్యంలో శుద్ధి కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఉత్సవమూర్తి విగ్రహ ప్రతిమలను పట్టణంలోని గోదావరి తీరంలో జలాభిషేకం నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పూజా కార్యక్రమాలు చేపట్టనున్నారు. మండలంలోని దిలావర్‌పూర్‌లోని రాజరాజేశ్వర స్వామి ఆలయకమిటీ ఆధ్వర్యంలో ఉత్సవమూర్తి విగ్రహాలతో గోదావరిలో అభిషేకం నిర్వహించారు.

గ్రామాల్లో కార్డన్‌సెర్చ్



నల్దుర్తిలో కార్డన్ సెర్చ్‌లో పాల్గొన్న సీఐ

మామడ: మండలంలోని నల్దుర్తి, వెంకటపూర్ గ్రామాల్లో సీఐ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని వాహనాలకు జరిమానా విధించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫోన్లలో వచ్చే ఓటీపీలను ఇతరులకు షేర్ చేయొద్దన్నారు. ప్రతిఒక్కరూ రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. ఎస్సైలు సందీప్, సుమలత, గోపి తదితరులు పాల్గొన్నారు.

కడెం టు ప్రయాగ్‌రాజ్

- బైక్‌పై బయల్దేరిన యువకులు



బైక్‌పై బయల్దేరుతున్న యువకులు

కడెం: మండల కేంద్రానికి చెందిన యువకులు రాయల తరుణ్, రాపర్తి విష్ణు బైక్‌పై ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రంలోని ప్రయాగ్‌రాజ్‌కు సోమవారం బయల్దేరారు. కుంభమేళాలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు బైక్‌పై వెళ్లారు. ప్రయాగ్‌రాజ్, కాశీ, అయోధ్య పుణ్యక్షేత్రాలకు వెళ్లనున్నట్లు వారు పేర్కొన్నారు.

‹నిరుద్యోగులను మోసగిస్తున్న కేంద్రం›

ఖానాపూర్: ప్రతీ ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి కేంద్రం నిరుద్యోగులను మోసం చేస్తుందని ఆదివాసీ కాంగ్రెస్ జిల్లా చైర్మన్ బానావత్ గోవింద్ అన్నారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో నిరుద్యోగులను ఓటు అడిగే అర్హత బీజేపీకి లేదన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.

హుండీ విరాళం



హుండీని విరాళంగా అందిస్తున్న వెంకటరమణ

మామడ: మండలంలోని పొన్కల్‌లో శివాలయానికి ఆర్ఎంపీ వైద్యుడు వెంకటరమణ సోమవారం హుండీని విరాళంగా అందించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. రాజేశ్వర్, లింగన్న, సుధాకర్‌రెడ్డి, గంగయ్య, రాజు ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ సమన్వయ కమిటీ నాయకులు

ముధోల్: మండలంలోని తరోడా గ్రామంలో సోమవారం బీఆర్ఎస్ క్యాలెండర్, డైరీలను పార్టీ నియోజక వర్గ సమన్వయ కమిటీ సభ్యులు లోలం శ్యాంసుందర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను ఇచ్చిన ఎన్నికల హామీలు వెంటనే అమలు చేయాలన్నారు. నాయకులు విఠల్, తరోడా మాజీ ఎంపీటీసీ గంగాధర్, నాయకులు పాల్గొన్నారు.

పరామర్శ

లోకేశ్వరం: మండలంలోని గడ్‌చాంద గ్రామానికి చెందిన తాజామాజీ సర్పంచ్ వెంకట్‌రావు తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. బాధిత కుటుంబ సభ్యులను జెడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్ సోమవారం పరామర్శించారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు, అనిల్, దిగంబర్, బండి ప్రశాంత్ ఉన్నారు.

ఖానాపూర్: పట్టణంలోని పద్మావతినగర్‌కు చెందిన ఇద్దరు మృతిచెందగా బాధిత అశోక్, శేఖర్ కుటుంబాలను బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్ సోమవారం పరామర్శించారు. అనంతరం అనారోగ్యంతో ఇంటి వద్ద చికిత్స పొందుతున్న నజీర్‌ను ఓదార్చారు. నాయకులు కలీల్, రాజు, రవి, రాజన్న, తదితరులు ఉన్నారు.

రోడ్లపైనే వ్యాపారాలు

- ఇష్టారీతిన వాహనాల పార్కింగ్
- రాకపోకలకు ప్రజల ఇబ్బందులు



బస్టాండ్ మార్గంలో వ్యాపారాలు, తోపుడుబండ్లు

భైంసాటౌన్: పట్టణంలోని ప్రధాన రోడ్ల వెంబడి ఇరువైపులా చిరు వ్యాపారాలతో ఇరుకుగా మారుతోంది. పండ్ల వ్యాపారుల తోపుడుబండ్లు, ఇతర చిరు వ్యాపారులు తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేసుకుని దుకాణాలు నిర్వహిస్తుండడం, ఇష్టారీతిన వాహనాల పార్కింగ్‌తో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. బస్సులు, లారీలు, వాహనాల రాకపోకల సమయంలో ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా వారసంత రోజైన సోమవారం పట్టణంలో రద్దీ విపరీతంగా ఉంటుంది. డివిజన్‌కేంద్రం కావడంతో చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు అధికసంఖ్యలో వస్తుంటారు. అయితే, రోడ్ల వెంబడి పాదచారుల కోసం పాదబాటలు ఆక్రమణకు గురవడంతో నడుచుకుంటూ వెళ్తున్నారు. అలాగే స్థానిక బస్టాండ్ నుంచి మున్సిపల్ చౌరస్తా వరకు రోడ్డుకిరువైపులా పదుల సంఖ్యలో తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేసుకున్నారు. వ్యాపారులు తోపుడుబండ్లను రోడ్లపైనే నిర్వహిస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చినవారు కూరగాయలు రోడ్డుపక్కనే విక్రయించడంతో ట్రాఫిక్ ఏర్పడుతుంది. ఆటోవాలాలు, ప్రైవేట్ వాహనాలను బస్టాండ్, ఏరియాస్పత్రి ఎదుట నిలుపుతున్నారు. మిర్చియార్డు మార్గంలోనూ రోడ్డు ఇరుకుగా మారింది. ఈ మార్గంలోనే ఎంఎల్ఎస్ పాయింట్, ఎరువుల గోదాంలు ఉండడంతో లోడ్‌తో లారీలు వచ్చిన సమయంలో ఇబ్బంది ఏర్పడుతోంది. అధికారులు వెంటనే పట్టించుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

'నరేందర్‌రెడ్డిని గెలిపించాలి'



భైంసారూరల్: ప్రచారంలో పాల్గొన్న మాజీ జడ్పీటీసీ సూర్యంరెడ్డి

భైంసారూరల్: కాంగ్రెస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించాలని మాజీ జెడ్పీటీసీ సూర్యంరెడ్డి కోరారు. మండలంలోని పేండ్‌పల్లి గ్రామంలో సోమవారం నిర్వహించిన ప్రచారంలో భాగంగా పట్టభద్రుల ఓటర్లను కలిసి మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడిన 14 నెలల్లోనే 54వేల ఉద్యోగాలు భర్తీచేసిన ఘనత కాంగ్రెస్‌కే దక్కిందన్నారు. మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు దీక్షిత్, కార్యకర్తలు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: కనకాపూర్, వడ్యాల్ గ్రామాల్లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఒడ్నాల రాజేశ్వర్ ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల వద్దకు వెళ్లి నరేందర్‌రెడ్డికి ఓటేయాలని అభ్యర్థించారు. యూత్ కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రటరీ రాజేందర్ యాదవ్, యూత్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ ఉన్నారు.

నర్సాపూర్(జి): మండల కేంద్రంలో కాంగ్రెస్ నేతలు ప్రచారం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు ఇంద్రకరణ్ రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ అజీమ్, మాజీ ఎంపీటీసీ మల్లేశ్, నాయకులు రమేశ్, గంగారెడ్డి, ఉమామహేశ్వర్, రఘు పాల్గొన్నారు.

సారంగపూర్: నరేందర్‌రెడ్డిని గెలిపించాలని కాంగ్రెస్ నాయకులు చించోలి(బి) గ్రామంలో ప్రచారం నిర్వహించారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు వెంకటరమణారెడ్డి మురళీ, నాయకులు ఉన్నారు.

సోన్: న్యూవెల్మల్‌లో కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు గడ్డం స్వామి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డిని మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. గ్రామ అధ్యక్షుడు బొడ్డు లక్ష్మణ్, నాయకులు బండారి నరసయ్య, సీహెచ్ గంగాధర్ ఉన్నారు.

కడెం: కాంగ్రెస్‌తోనే ఉద్యోగాల భర్తీ సాధ్యమని పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు చొప్పదండి దుర్గభవాని అన్నారు. కొత్త మద్దిపడగలో సోమవారం పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. నాయకులు దుల్లె వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం

లక్ష్మణచాంద: బీజేపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్యలకు మద్దతుగా మండలకేంద్రంలోని పలు పాఠశాలల్లో నాయకులు సోమవారం ప్రచారం నిర్వహించారు. చిన్నయ్య, రమేశ్, సురకంటి ముత్యంరెడ్డి పాల్గొన్నారు.

కుంటాల: బీజేపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని నాయకులు కోరారు. సోమవారం కుంటాలలో ప్రచారం నిర్వహించారు. వెంకట్‌రావు, రమణారావు, గోవర్ధన్, వంశీ, గజేందర్, తురాటి గజేందర్, అల్ల గజేందర్, పట్టభద్రులు పాల్గొన్నారు.

'రవీందర్‌సింగ్‌కు ఓటేయాలి'

నిర్మల్‌టౌన్: పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సర్దార్ రవీందర్‌సింగ్‌కు ఓటేసి గెలిపించాలని బీసీ సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు హరిప్రసాద్ కోరారు. జిల్లాకేంద్రంలో ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన మాట్లాడారు. రవీందర్ సింగ్ గెలిపిస్తే నాలుగు జిల్లాల పట్టభద్రులందరికీ రూపాయికే హెల్త్ ఇన్సూరెన్స్, నల్లా కలెక్షన్, అంతిమ యాత్ర సదుపాయాలు కల్పిస్తారన్నారు. బీసీ జేఏసీ నాయకులు అనిల్, మహేశ్ పాల్గొన్నారు.



కాల్వగడ్డ వీధిలో కోతులు

కోతుల స్వైరవిహారం

జిల్లా కేంద్రంలో కోతులు స్వైరవిహారం చేస్తున్నాయి. వీధుల్లో పదుల సంఖ్యలో సంచరిస్తున్నాయి. ఇళ్లపై బీభత్సం సృష్టిస్తున్నాయి. రోడ్లపై వెళ్లేవారిపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. రహదారిపై వెళ్లాలంటే జనం జంకుతున్నారు. అటవీ అధికారులు స్పందించి కోతులను బంధించేలా చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

కళ్లద్దాలు అందజేత



విద్యార్థులకు కళ్లద్దాలు అందిస్తున్న ప్రిన్సిపాల్

భైంసాటౌన్: పట్టణంలోని తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాలలో సోమవారం పలువురు విద్యార్థులకు కళ్లద్దాలు అందజేశారు. ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించగా, పలువురు దృష్టిలోపంతో బాధపడుతున్న వారిని గుర్తించారు. ఈ మేరకు అవసరమైనవారికి కళ్లద్దాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎంఏ జబ్బార్, వైస్ ప్రిన్సిపాల్ సాయినాథ్, మెడికల్ ఆఫీసర్ మతీన్, నర్సింగ్ ఆఫీసర్ దీప్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.